
# విశాలి

ఉన్నవ
మదనమోహన
రావు



విశాలికి ఉరిశిక్ష విధించింది న్యాయస్థానం.

అందుకు నేను ఆశ్చర్యపోలేదు. కారణం—విశాలి చేసిన నేరానికి ఉరిశిక్ష పడుతుందని తెలుసు. కాని, అంతకంటే ఆశ్చర్యం కలిగించింది ఏమిటంటే, విశాలి తన చివరి కోరికగా నన్ను ఒకసారి వచ్చి కలుసుకోమని ప్రాధేయపడుతూ వ్రాయటం.

ఉత్తరం వచ్చి నాలుగు రోజులైనా విశాలిని కలియటమా? మానటమా? నిశ్చయించుకోలేని సందిగ్ధావస్థలో, పడ్డాను. ఎన్నోసార్లు ఆ దురదృష్టవంతురాలిని తలుచుకొని జాలి పడ్డాను. అయినా, విశాలి అంతటి ఘోరానికి ఎలా తలపడ్డదో ఇప్పటికీ నాకు అనూహ్యం. భర్తనే దైవంగా పూజించే భారతయ స్త్రీ, అందులోనూ విశాలి వంటి అమాయకురాలు భర్తను చంపిందంటే నమ్మకం కలగటం కష్టం. కాని, జరిగింది మాత్రం సత్యం. విశాలి భర్త—ఆ దురదృష్టవంతుడు—విశాలి చేతులలో దారుణంగా హత్య చేయబడ్డాడు.

విశాలి ఇప్పుడు హంతకురాలు. నే నెరిగిన విశాలి కాదు. ఆ విశాలికీ, ఈ విశాలికీ ఎంతో భేదం. ఆ విశాలి అమాయకురాలు. అశుభం శుభం తెలియని ఆడపిల్ల. కాని, ఈ విశాలి దైవంగా చూసుకోవలసిన భర్తను హత్య చేసిన పాతకి; దోషి. ఉరికంబానికి కాబోయే అతిథి!

ఆ పాతకిని చూడకుండా ఉండటమే మంచిదని తోచింది. రేపు పది గంటలకు జైలులో కలుసుకోవాలి. ఎల్లుండి సూర్యోదయం తరవాత విశాలికి జీవించే అధికారం లేదు.

ఆ రాత్రంతా నాకు నిద్ర పట్టలేదు. విశాలి. . . నే నెరిగిన చిన్ననాటి విశాలి. ఇరవై ఐదేండ్లకే నూరేండ్లు నింపుకున్న విశాలి. నన్ను నిదుర పోనీయలేదు. నా ఇరవై ఎనిమిదేండ్ల జీవితంలో విశాలిని గురించి ఆలోచిస్తూ నిద్ర లేకుండా రాత్రంతా గడపటం ఇది రెండవ సారి!

* * *

మొదటిసారి. . . సరిగ్గా పదేండ్ల క్రితం ఇలాగే ఒక రాత్రి నిద్ర పోకుండా గడిపాను. అవి నేను బి. ఎ. ఫైనలియర్ చదువుతున్న రోజులు. నేను, ఒక స్నేహితుడు రూమ్ తీసుకుని ఉంటున్నాము. రాత్రి పదకొండు గంటలు కావస్తూంది. నే నింకా మేలుకునే ఉన్నాను. తలుపు తట్టిన చప్పుడు, లేచి వెళ్ళి తలుపు తెరిచాను. ఎదురుగా

విశాలి! అంత రాత్రప్పుడు విశాలిని ఒంటరిగా నా గది ముందు చూసి ఆశ్చర్యపోయాను. 'విశాలీ!' అన్న మాట తప్ప మరో మాట నా నోటి నుండి రాలేకపోయింది.

'అవును, ఆనంద్! నేను విశాలినే. కంగారుపడకు. నేను వచ్చేశాను. నీ కోసం వచ్చేశాను! నీ ప్రేమ కోసం ఇంటినుండి పారిపోయి వచ్చేశాను. మనం పారిపోదాం, ఆనంద్! ఇదిగో, నా ఒంటిమీద కొన్ని నగలు ఉన్నాయి. వీటిని అమ్మివేయి. ఎక్కడికైనా పోదాం. ఈ రాత్రికే పోదాం. . . తెల్లవారితే అమ్మ, నాన్నలకు తెలియగలదు. . . వద, ఆనంద్! ఆలస్యం చేయకు! మన వాళ్ళెవరూ లేని చోటికి దూరంగా పోదాం. లేకపోతే నేను నీకు దక్కను, ఆనంద్! మా వాళ్ళు నాకు పెళ్ళి చేయబోతున్నారు. . . అందుకనే బస్సెక్కి నీ దగ్గరికి వచ్చేశా. . . ఇప్పుడే పోదాం, ఆనంద్. తెల్లవారేసరికి మన వాళ్ళకు కొన్ని వందల మైళ్ళ దూరంలో ఉంటాం!''

నాకు నిజంగా భయం వేసింది. ఏం చేయటానికి తోచలేదు. నేను జీవితంలో ఎన్నో సాధించాలనీ, ఏమేమో చేయాలనీ, సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని పొందాలనీ దృఢంగా నిశ్చయించుకున్నాను. అందుకొరకు ఎంతటి కఠోర సాధనకైనా సిద్ధంగా ఉన్నాను. విశాలి అంటే నాకు అభిమానం లేకపోలేదు. నా హృదయాంతరాలలో ఎక్కడో ప్రేమ గూడు కట్టుకునే ఉంది. కాని, ఆ పరిస్థితులలో విశాలి కోసం నా పరీక్షల భవిష్యత్తు, నా ఆశయాలు—వీటన్నిటినీ ఉన్నఫళంగా వదులుకొని, బికారిగా దేశంలో తిరగటం నాకు చేతగాని పనిగా తోచింది.

అదే సంగతి విశాలితో చెప్పాను. విదానంగా ఆలోచించమన్నాను. ఆవేశపడవద్దన్నాను.

నా మాటలు విశాలిని నిరుత్సాహపరిచాయి. విశాలి పెంచుకున్న ఆశాలతను చిందర వందర చేశాయి. విశాలిని ఊహాల లోకం నుంచి వాస్తవ ప్రపంచంలోకి పడతోసినాయి. విశాలి ఏడ్చింది. ఎంతసేపుఏడ్చిందో తెలియదు. ఎలా ఓదార్చాలో తెలియలేదు.

'నాతో రాలేవా, ఆనంద్?' చివరిసారిగా అడిగింది హృదయంలోని బాధను, పొంగి పొరలి వస్తున్న దుఃఖాన్ని బలవంతాన అపుకుంటూ.

నేను మాటగా జవాబివ్వలేకపోయాను. నా జీవిత ఆశయాన్నీ, ఆ లక్ష్యసాధనకు ఎలా కృతనిశ్చయంతో ఉన్నదీ మరోసారి చెప్పాను.

విశాలి మౌనంగా ఉండిపోయింది. ఆమె గుండెలో ఎన్ని అగ్ని పర్వతాలు

# ముగ్గుల్లో గొబ్బిళ్ళు


ఈ సంక్రాంతికి తెలుగుదేశం రంగులతో, తెల్లని ముగ్గులతో నిండి ఉంటుంది.


మీరూ పెట్టాలిగా రంగవల్లికలు. ఈ క్రింద కొన్ని ముగ్గులు చుక్కలతో ఎలా పెట్టాలో రాశాను. వేయండి.

1. మొదట 13 చుక్కలు 5 వరసలు పెట్టుకోవాలి. తరవాత చెరొక వైపు ఒక్కొక్క చుక్క వదిలి, అంటే (11, 9, 7, 5) 5 చుక్కల వరకూ పైన, కింద జాగత్తగా పెట్టుకోవాలి. చుక్కలన్నీ ముగ్గులో ఉన్నట్లు కలుపుకోవాలి.

2. మధ్య 15 చుక్కలు ఒక వరస పెట్టుకోవాలి. తరవాత ఒక చుక్కకి ఒక చుక్కకీ మధ్య ఒక చుక్క చొప్పున పెడుతూ, అంటే (14,13,12,11, 10,9,8) 8 చుక్కలవరకూ పెట్టుకోవాలి. పైభాగము, క్రిందిభాగము చుక్కలు పెట్టి ముగ్గులో చూపిన విధంగా కలుపుకోవాలి.

రచన, చిత్రాలు:
**సుభద్ర**





బద్దలౌతున్నాయో తెలుసుకోవటం కష్టం.

ఇద్దరికీ తెలియకుండానే తెల్లవారి పోయింది. విశాలిని వెంటనే బస్సు ఎక్కించి ఊరికి పంపించివేశాను.

❦

ఆ తరవాత విశాలిని గురించి ఈ పదేళ్ళలో నేను ఆలోచించలేదు. ఒక రకంగా మరిచి పోయాననుకూడా! 'మరిచి పోయాను' అనే దానికంటే నా జీవిత లక్ష్యం మీది పట్టుదల, కృషి నన్ను అహోరాత్రాలు శ్రమించేలా చేసి విశాలిని గురించి ఆలోచించటానికి వ్యవధి కల్పించ లేదనటం సబబేమో? ఆ లక్ష్య సాధన కొరకే అమ్మ ఎంతగానో పోరుతున్నా వివాహం చేసుకోలేదు. ఈ నాటికి నా లక్ష్యాన్ని చేరుకోగలిగిగాననే తృప్తి నాకు ఉన్నది. ఉన్నత పరీక్షలలో నేను పొందిన స్వర్ణ పతకాలే అందుకు నిదర్శనం. ఈనాడు నేనుబాధ్యత గల ఉన్నతోద్యోగిని. సమాజంలో పరువు ప్రతిష్ఠలు గల వ్యక్తిని.

నాకు తెలియకుండానే నా లోని ఏదో అజ్ఞాత శక్తి నన్ను విశాలి కోసం వెళ్ళేలా చేసింది. జైలు అధికారులు నన్ను సాద రంగా ఆహ్వానించి ఒక గదిలో కూర్చో బెట్టారు. మరి కొన్ని నిమిషాలలో విశాలి అక్కడికి వస్తుంది. విశాలిని గురించిన స్మృతులు నా మనఃఫలకంలో మెరుస్తు న్నాయి.

విశాలివాళ్ళూ, మేమూ పక్క పక్క వాటాలలో ఉండేవాళ్ళం. అప్పుడు మేము మరీ చిన్న పిల్లలం. విశాలికి ఆరు, ఏడు ఏండ్ల వయస్సు. నాకు ఎనిమిది, తొమ్మిది ఏండ్లు ఉండవచ్చు. పసితనపు ఆటలు ఇంకా పోలేదు. ఒక రోజున విశాలీ, నేనూ, మా బుజ్జీ, వాళ్ళ చిట్టీ అందరం అన్నాలాట ఆడుకున్నాం. విశాలి అమ్మ పాత్ర, నేను నాన్న పాత్ర ధరించాం. మా బుజ్జి, వాళ్ళ చిట్టి మా సంతానం. విశాలి ఇంట్లోంచి వేరుసెనగ పప్పు తెచ్చింది, ఆటల్లోకి. విశాలి అమ్మ పాత్ర ధరించింది గా? అందుకని పిల్లలని గదమాయిస్తు న్నది. 'ఉండండర్రా! గోల చేయకండి మరి! ఇదిగో, వంట కాగానే అన్నం పెడతాను మరి...! మీరు అలా బజారుకు వెళ్ళి కూరలు పట్టుకు రండి! . . . నాకు పురమాయించింది.

నేను బజారు వెళ్ళి కూరలు తెచ్చినట్టు నటించాను. బుజ్జి, చిట్టి అన్నం పెట్టమని కూర్చున్నారు. విశాలి తాను తెచ్చిన వేరుసెనగపప్పులు కొద్ది కొద్దిగా పిల్లలకు, నాకు వడ్డించింది. నాకు వేరుసెనగపప్పు అంటే బలే ఇష్టం. అందరిలోకి నేనే పెద్దవాణ్ణి, అందుచేత అబ్బ! విశాలీ, నీ వంట ఎంత బాగుం దనీ! మరి కాస్త పెట్టు. కొంచెం కూర వేయి' అంటూ పప్పులలో చాలా భాగం తినేశాను.

అంతలో వాళ్ళ చిట్టి 'నువ్వు తినవా, విశాలీ?' అని అడిగింది.

'నేను అమ్మను గదా, చిట్టీ? నాన్న గారిని తినవీ! నాన్నగారు తింటే అదే నాకు తృప్తి' అంది నిజంగా జీవితంలో అమ్మ పాత్రను పోషిస్తున్నదానిలా.

పాపం! విశాలికి ఒక పప్పుకూడా మిగల్చకుండా మేమే తినేశాం! అయినా, విశాలి సంతోషంగా నాన్నకి పెట్టి తృప్తి పడ్డది! ఆ దృశ్యం తలుచుకుంటే నాకు మేను పులకరించింది.




మహిళాసాహితి శీర్షికలో శ్రీమతి సత్యవతి రచనలు
(రేడియోలో విన్నవి, పత్రికలలో చదివినవి, మరికొన్ని)
రక రకాల వంటలు: రు 9.00
(రెండు నూర్లుకూరలు - నూరు పచ్చళ్ళు)
రక రకాల పిండివంటలు: రు 7.00
(నూరు స్వీట్సు - నూరు హాట్సు)
రు 16.00 M.O. పంపిన వారికి పోస్టేజి ఉచితం.
జయంతి పబ్లికేషన్సు: విజయవాడ-2

ఆపరేషన్ అవసరం లేకుండానే మొలలు ముడుచుకు పోయేటట్లు చేసే అద్వితీయమైన ఔషధం





ప్రిపరేషన్ హెచ్*

అమెరికన్ డాక్టర్లవల్ల పరిశీలించబడింది

- నిమిషాల్లో దురదను పోగొట్టుతుంది.
- తక్షణం నొప్పిని నివారించుతుంది.
- తీవ్రమైన సందర్భములలో తప్ప, ఆపరేషన్ అవసరం లేకుండానే మొలలు ముడుచుకుపోయేటట్లు చేస్తుంది.
- బాధచేసి బాధ లేకుండా విరేచన మయ్యేటట్లు చేస్తుంది.

ఉచితం!
మూలవ్యాధిని గురించి వివరణాత్మకమైన చిన్న పుస్తకం ఒక ఉచిత ప్రతి కోసం (25 పైసల తపాలా బిళ్లలను జతపరచి) డిపార్టుమెంట్, PH-89 పోస్టు ఆఫీస్ బాక్సు నం 10133 బొంబాయి 400 001కి, నేడే వ్రాయండి.

*Regd. User of TM: Geoffrey Manners & Co. Ltd
743-PH-92 TEL



పండుగ ఇనాము కోసం

ఫోటో—ఎమ్. మల్లారెడ్డి (ఆవడి)

విశాలి వచ్చింది. పదేండ్ల నాటి విశాలికీ, ఈ విశాలికీ ఎంతో మార్పు ఉంది. ఆ నాటి విశాలి అప్పుడే వికసించు తున్న ముగ్ధ కుసుమం. ఈ నాటి విశాలి జీవితమనే పెను తుఫానుతో పోరాడి, పోరాడి, ఓడిపోయి, వాడి, మలినమై రాలిపోవటానికి సిద్ధంగా ఉన్న పుష్పం.

'బాగున్నావా, ఆనంద్!' అడిగింది విశాలి.

'అవును' అన్నట్టు తల ఊపాను.

'రావేమో అనుకున్నాను.'

నేను మౌనంగా ఉండిపోయాను.

'నీ జీవిత లక్ష్యాన్ని సాధించా వను కుంటాను. ఈ ఊరు వేళారటగా?' అంటున్నప్పుడు విశాలి కళ్ళు మెరిశాయి.

'అవే అనుకుంటున్నాను.' సమాధాన మిచ్చాను.

'పెళ్ళి చేసుకున్నావా?'

'లేదు.'

'ఎందుకని?'

'ఎందుకనంటే జవాబు చెప్పలేను.'

'పెళ్ళి చేసుకో, ఆనంద్! నీవు సుఖంగా ఉంటే అదే నాకు పది వేలు' అంటున్నప్పుడు విశాలి గొంతు జీర పోయింది. దుఃఖం పెల్లుబుకుతున్నది.

'బాధ పడుతున్నావా, విశాలీ' అన్నాను.

'లేదు, ఆనంద్, బాధ ఎందుకు? నేను చేసిన నేరానికి నాకు తగిన శిక్ష విధించారు. నేను కోరుకున్నదీ ఈ శిక్షనే, ఆనంద్, నేను ఏం చేశానో నీకు తెలుసుకదూ? నా భర్తను చంపివేశాను. అతి దారుణంగా చంపాను. ముక్కలు ముక్కలుగా నరికాను. అంత శక్తి నాలో ఎలా వచ్చిందని ఆశ్చర్యపోతున్నావు కదూ? నిజమే. నాకూ ఆశ్చర్యంగానే ఉంది, నే నెలా చంపానా' అని. అయినా నేను అందుకు విచారపడటం లేదు, ఆనంద్.

'జీవితంలో కొందరు చేసిన చిన్న పొరపాట్లు వారిని జీవితాంతం వేధిస్తాయి, ఆనంద్. నాకూ అంతే జరిగింది. నేను చేసిన చిన్న పొరపాటు నా పాలిట శాపమై నన్ను అనుక్షణం బాధపడేలా చేసింది.

ఆ రోజు రాత్రి నేను నీ దగ్గరకు వచ్చాను కదూ? అదే నా జీవితాన్ని కలుషితం చేసింది. నేను ఇంటికి వెళ్ళే సరికి ఊరంతా ఏమనుకున్నారో తెలుసా? నేను లేచిపోయానని ఒకటే గోల! నిజానికి నేను ఇంట్లో లేనిది పన్నెండు గంటలు మాత్రమే. కాని, కాకులతో నిండిన ఈ సంఘానికి ఆ పన్నెండు గంటలూ పెరిగి పెరిగి మూడు నాలుగేళ్ళుగా కనిపించాయి. లేచిపోయిన దాన్నని నాకు పెళ్ళి కాలేదు, కానీయలేదు ఈ సంఘం. మొదట్లో గౌరవంగా చూసినా, చివరికి కన్న తల్లి తండ్రులుకూడా నేను చేసిన పనిని క్షమించలేకపోయారు.

'ఇరవైమూడేండ్ల వయస్సు వచ్చి పెళ్ళి కాకుండా, అందులోనూ కళంకాన్ని భరిస్తూ, ఇంట్లో కూర్చోవడం ఆడ దానికి ఎంత కష్టమో, నీకు తెలియదు ఆనంద్. ఆ బాధ నీవు అర్థం చేసుకో లేవుకూడా.

'చివరికి నా మొర భగవంతుడు ఆలకించాడు. నాకు పెళ్ళి జరిగింది. నా భర్తది ఈ ఊరే. ఆయన నా అందాన్ని మెచ్చుకునేవాడు. నేను నిజంగా మురిసి పోయేదాన్ని. కాని, తరవాత తెలుసు కున్నాను నా జీవితం ఒక దుర్మార్గుడి చేతిలో ఉన్నదని. వ్యాధుని సంగీతంచే ఆకర్షింపబడి నిలిచిపోయిన లేడిపిల్లలా ఉంది నా స్థితి. వాడు నాకు భర్త కాదు. సమాజం దృష్టిలో వాడు నాకు భర్త. నేను వాడి భార్యను. వాడు నీచుడు, ఆనంద్. ఏ భర్త తన భార్యకు చెప్పనటు వంటి పని నాకు చెప్పాడు. నేను వాడికి భార్యను కాదు, పామ్మన్నాడు. వాడు డబ్బు, పలుకుబడి సంపాదించటానికి నన్ను వినియోగించుకోవాలని చూశాడు. అందుకే నన్ను చేసుకున్నాడట. నేను ఎంత నచ్చచెప్పినా, బ్రతిమాలినా, ఏడ్చినా ఆ కఠినాత్ముడు వినలేదు. ఆనంద్. . . . వినలేదు! ! పైగా ఏం అన్నాడో తెలుసా?

"పెద్ద పతివ్రతలా వేషాలు వేయకు! నీ సంగతి ఎవడికి తెలియ దనుకున్నావ్? మూడు నాలుగేళ్ళు ఎవడితోనో లేచి పోయి ఉన్నావు! వాడు తన్ని తగలేస్తే సంగనాచిలా అమ్మ, నాన్నల దగ్గర చేరావ్! !"

'ఇది నిజమా, ఆనంద్! నేను నీ దగ్గరికి వచ్చి ఎన్ని గంటలు ఉన్నాను? నీవు చెప్పు, ఆనంద్, నేను ఏ పాపం ఎరగనని! ! నీవు చెప్పు. . .! నా మీద ప్రమాణం చేసి చెప్పు. . . నేను ఏ పాపం ఎరగనని చెప్పు, ఆనంద్! చెప్పు! ! నీవు చెబితే సంతోషంగా నవ్వుతూ మరణిస్తా! నాకు మరణబాధ ఉండదు!

'నిజంగా నీవు ఏ పాపం ఎరగవు, విశాలి! నిజం!' అంటూ ఏడుస్తున్న విశాలిని హృదయానికి హత్తుకున్నాను. విశాలి కన్నీటితో నా హృదయాన్ని తడిపి వేసింది.

'ఇప్పుడు నాకు తృప్తిగా ఉంది, ఆనంద్! ఇక భయం లేదు, ఆనంద్! హాయిగా, సంతోషంగా మరణిస్తాను, ఆనంద్! నా కో వరం ఇవ్వవూ! ఇలానే, ఇలానే నీ గుండెల్లో తల దాచుకునే అదృష్టం. సరే! ఈ జన్మ కిక లేదుమకో! మరో జన్మలోనైనా ఇవ్వవూ?'

విశాలి నన్నుపిచ్చిగా కౌగిలించుకున్నది. నాకు తెలియకుండా నా కనుల నుండి రెండు వేడి అశ్రుబిందువులు జారి విశాలి తలమీద పడ్డాయి.

• • •

జీవితంలో నేను సాధించిన దానికంటే పోగొట్టుకున్నదే ఎక్కువని ఆ క్షణంలో నాకు తెలిసింది. నేను పొందిన స్వర్ణ పతకాలూ, డిగ్రీలూ, ఉద్యోగం, అధికారం, పలుకుబడి, పరువు ప్రతిష్ఠలూ సమస్తం నేను పోగొట్టుకున్న దానితో తూచి చూస్తే చాలా తేలికగా అనిపించాయి! నిస్తేజంగా అనిపించాయి!

• • •

అందుకనేనేమో నాకు వివాహం చేసుకోవాలనే కోరిక కలగలేదు నా జీవితంలో! *